క్లుప్తంగా

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు


ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాలపొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారుచేసేందుకు సైతం పోటీపడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. స్వామిని దర్శించుకునేందుకు అధిక సమయం క్యూలో వేచియుండాల్సి వచ్చింది. నాగబంధాల వద్ద గోశాల వద్ద మహిళలు పూజలు చేశారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్థలదాత సరోజినీకి సన్మానం



గుడ్లవల్లేరు: కౌతవరం కాశీగూడెం రామాలయ పునర్నిర్మాణానికి స్థలం సమర్పించిన వడ్లమూడి సరోజినీ గ్రామస్తులు సన్మానించారు. రూ.20 లక్షల అంచనాతో ఆదివారం రామాలయ నిర్మాణానికి ఆమె చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్లమూడి సుబ్రహ్మణ్యం, బొబ్బా నరసింహారావు, నాగయ్య, ఆలయ కమిటీ సభ్యులు మద్దాల జగన్, నాంచారయ్య పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి పవిత్రోత్సవాలు



తోట్లవల్లూరు: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 16 నుంచి ఆరంభమైన పవిత్రోత్సవాలు సోమవారం ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామికి పవిత్రాలతో ఆదివారం అలంకరించారు. ఆలయ అర్చకులు భాగవతుల మణికంఠాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరి దుర్గా నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బీఎస్పీ సమావేశాలు జయప్రదం చేయండి



గుడివాడ టౌన్: బీఎస్పీ రాష్ట్ర స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ దారం కరుణాకర్ కోరారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో సమావేశాల బ్రోచర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులగణనను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని బీఎస్పీ కొంత కాలంగా పోరాటం చేస్తోందన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా ప్రజలను జాగృతి చేసేందుకు ఈ నెల 20వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. బీసీ కులగణన ఆవశ్యకత సమాజానికి అవసరం అనే అంశాలపై ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఎస్పీ నాయకులు అధిక సంఖ్యలో ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మూల్పూరి మరియబాబు, నాయకుడు పాల్ పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలు



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మెగా రక్తపరీక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద వాకర్స్‌కు ఈ పరీక్షలు నిర్వహించామని క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ తెలిపారు. మొత్తం 269 మంది నుంచి రక్త నమూనాలు సేకరించామని పేర్కొన్నారు. వీటిని భాగ్యలక్ష్మి రక్త పరీక్ష కేంద్రానికి పంపి ఫలితాలను వాకర్స్‌కు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కొమరవోలు రామకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని బొడ్డపాడులో జరిగింది. గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఎస్ఐ ఎం. అర్జునరాజు ఆదివారం పోలీసు సిబ్బందితో దాడి చేశారు. 12 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.16,300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పశువులకూ తప్పని దోమపోటు

దోమకాటు కేవలం మనుషులకే కాదు పశువులకూ తప్పడం లేదు. దోమకాటు పశువులను పట్టి పీడిస్తోంది. దోమలు కుట్టడంతో పశువులు వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నాయి. దీంతో పాల దిగుబడి కూడా గణనీయంగా తగ్గుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన పాల దిగుబడి



దోమకాటు నుంచి పశువులను కాపాడుకునేందుకు దోమతెరను ఏర్పాటు చేసిన రైతు

పామర్రు: మండలంలోని పలు గ్రామాల్లో దోమల ఉధృతి అధికంగా ఉంది. గ్రామాల్లోని పశుపోషకులు దోమల బారి నుంచి పశువులను రక్షించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళల్లో అయితే అధికంగా ఉన్న దోమలను నిర్మూలించేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. దోమకాటు వల్ల పాడి గేదెలు పాలు ఇవ్వని సందర్భాలున్నాయని రైతులు వాపోతున్నారు. దోమకాటు కారణంగా పాల దిగుబడి గణనీయంగా తగ్గడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోజుకు నాలుగు లీటర్ల వరకు పాలిచ్చిన గేదెలు దోమకాటు వల్ల రెండు లీటర్లు మాత్రమే ఇస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ చర్యలు

దోమ కాటు నుంచి పశువులను రక్షించేందుకు దోమ తెరలు వాడుతున్నామని కొందరు.. పశువుల పాకల్లో సీలింగ్ ఫ్యాన్‌లు ఏర్పాటు చేశామని మరి కొందరు చెబుతున్నారు. దోమ తెరలు, సీలింగ్ ఫ్యాన్లు రెండూ ఏర్పాటు చేయడంతో పాటు సాయంత్రం వేళల్లో ఎండు, పచ్చగడ్డితో పొగ వేస్తున్నామని రైతులు పేర్కొన్నారు. దోమల బారి నుంచి పశువులను రక్షించుకునేందుకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోందని పశుపోషకులు అంటున్నారు.

రోగాల బారిన పశువులు

దోమకాటు కారణంగా పశువులు రోగాల బారిన పడిన దాఖలాలు అనేకం ఉన్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో సాయంత్రం వేళల్లో పశువుల పాకలో పొగవేసి రాత్రి నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తూ పశువుల పాకకు నిప్పంటుకుని పాకతో పాటు పశువులు కూడా కాలిపోయిన సంఘటనలు ఉన్నాయి. దీంతో పొగ వేసేందుకు రైతులు భయపడుతున్నారు.

నెల రోజుల్లో పెరిగిన దోమల సమస్య

ప్రస్తుతం వాతావరణంలో మార్పులు సంతరించుకున్న నేపథ్యంలో దోమలు అధికమయ్యాయి. నెలరోజులుగా దోమల ఉధృతి అధికంగా ఉందని రైతులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు ఈ విషయమై తగు విధమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంచాయతీల పరిధిలో దోమల నివారణకు ఫాగింగ్ తదితర చర్యలు చేపట్టాలని పశుపోషకులు కోరుతున్నారు.

దోమలను నివారించాలి



దోమల ఉధృతి ఎక్కువ కావడంతో ప్రజలతో పాటు పశువులు ఇబ్బందులు పడుతున్నాయి. డ్రెయినేజీలు లేకపోవడంతో రహదార్లపైనే వర్షం నీరు నిల్వ ఉంటోంది. నిల్వ నీటిలో దోమల ఉత్పత్తి పెరగడంతో అవస్థలను ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలి.

– ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, రైతు, పామర్రు

పాల దిగుబడి తగ్గుతోంది

దోమ కాటు వలన పశువుల్లో పాల దిగుబడి తగ్గుతోంది. తీవ్ర దోమల వలన పశువులు పూర్తి స్థాయిలో విశ్రాంతి తీసుకోలేక పోవడంతో పాలు సరిగా ఇవ్వడంలేదు. గ్రామాల్లో దోమల నివారణకు సత్వరమే చర్యలు తీసుకోవాలి.

– నందిపాటి సాంబిరెడ్డి, రైతు, పామర్రు

గంగానమ్మా.. చల్లంగా చూడమ్మా..



కైకలూరు గంగానమ్మ గుడి వద్ద భక్తులు



మండవల్లిలో విశేషాలంకరణలో గంగానమ్మ తల్లి



మండవల్లిలో పోతురాజును ఊరేగిస్తున్న దృశ్యం



ముదినేపల్లిలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కైకలూరు: అమ్మా.. గంగానమ్మ.. నీ చల్లని దీవెనలు మాకు అందించమ్మా అంటూ భక్తులు గంగానమ్మను భక్తితో వేడుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా కైకలూరు బైపాస్‌రోడ్ గంగానమ్మ ఆలయం వద్ద స్థానిక ముఠా కార్మికులు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ఊరంతా గొర్రెలను ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు తులసి పూర్ణ మాట్లాడుతూ గంగానమ్మ జాతర ఈ నెల 30 నుంచి సెప్టెంబరు ఒకటో తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలో శ్రీగంగానమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక గౌడ, రజక సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాలు కనక డప్పులతో ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జాతర నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలో ఆదివారం ఘనంగా గంగానమ్మ జాతర జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో గంగానమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి వేడి, చల్ది నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గ్రామంలోని పుర వీధుల్లో పోతురాజును ఘనంగా ఊరేగించారు. యువకులు అధిక సంఖ్యలో చేరి ఊరేగింపులో డప్పు, వాయిద్యాల కనుగుణంగా నృత్యం చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. గంగానమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాయకుల సేవలు సదా స్మరణీయం



గాయకులు సుశీల్‌కుమార్, భారతీలను సత్కరించిన నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: మధుర గాయనీ గాయకుల సేవలు సదా స్మరణీయమని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం అమర గాయకుల స్ఫూర్తి కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రను తిరగరాసిన గాయకులు చాలామందే ఉన్నారని వారిలో ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, పీబీ శ్రీనివాస్, మాధవ పెద్దిసత్యం, భానుమతి లాంటి వారు ఎందరో ఉన్నారన్నారు. వారి సేవలను నేటి గాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కళాపోషకుడు శింగంశెట్టి చంద్రశేఖర్, చెట్లపల్లి మారుతి ప్రసన్న, సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మనందరావు ప్రసంగించారు. గాయకులు సుశీల్ కుమార్, భారతీలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. సుశీల్‌కుమార్, డేవిడ్‌రాజు, ప్రిన్స్, కుమార్ గుప్తా, అయ్యప్పన్, స్వాతి, భారతి, రజని, దుర్గా నాగమణి, కామేశ్వరీలు చిత్ర గీతాలను ఆలపించారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు

పెనమలూరు: వృద్ధుడు అదృశ్యంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని గోసాల గ్రామ పరిధిలోని ఈదుల డొంక ప్రాంతానికి చెందిన బెజవాడ బాబూరావు (85) ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానికంగా విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాబూరావు కుమారుడు లోకేశ్వరరావు పోలీసులను ఆశ్రయించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారుల రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని లింగవరం గ్రామం వద్ద వాహన తనిఖీలను ఆదివారం సాయంత్రం చేపట్టారు. వాహనాల రికార్డులు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్స్‌లు లేని వారికి అపరాధ రుసుం విధించారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ గ్రామోత్సవం



గొడపేటలో అమ్మవారికి హారతులు పడుతున్న భక్తులు

గన్నవరం: లక్ష్మీతిరుపతమ్మ గ్రామోత్సవం గన్నవరంలో ఘనంగా కొనసాగుతోంది. ఈ నెల 16వ తేదీన నిర్వహించిన శ్రావణమాస ఉత్సవాలు అనంతరం లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకి వాహనంపై ఉంచి గ్రామోత్సవం ప్రారంభించారు. పాతగన్నవరం, చింతలపేట, రామ్‌నగర్, సొసైటీపేట, రాయ్‌నగర్ ప్రాంతాల్లో గ్రామోత్సవం కొనసాగింది. ఆదివారం ఉదయం నుంచి సగర్లపేట, యాదవులపేట, చెంచులకాలనీ, గొడపేట, బుద్దవరం రోడ్డు, శ్రీనగర్ కాలనీలో కొనసాగింది. తమ ఇళ్ల ముందుకు వచ్చిన అమ్మవారికి భక్తులు దర్శించుకుని హారతులు పట్టారు. డప్పువాయిద్యాలు, యువకుల కోలాహలం మధ్య గ్రామోత్సవం అత్యంత ఉత్సాహంగా సాగుతుంది. గ్రామోత్సవం సోమవారం తెల్లవారుజామతో ముగుస్తుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. అనంతరం ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకుంటాయని చెప్పారు. అమ్మవారి శ్రావణమాస ఉత్సవం, ఊరేగింపు విజయవంతానికి సహకరించిన ఆలయ కమిటీతో పాటు భక్తులు, పోలీస్ శాఖకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ప్రిన్సిపాల్ రమణమూర్తి

అడ్డాడ(పామర్రు): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ .రమణమూర్తి పేర్కొన్నారు. పామర్రు మండలం అడ్డాడ గ్రామంలోని అరవింద స్కూల్లో విజేతలను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన నరసారావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి బహుమతులను సాధించారన్నారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో గుంటూరు జిల్లా నూతక్కిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్.పవన్‌కుమార్, బి.కవిత పాల్గొన్నారు.

కొండలమ్మ ఆలయంలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూలో భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి చీరల వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 19, 26 తేదీల్లో అమ్మవారి చీరల వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ గంగాధర్‌రావు తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం



గుర్రాల్లంకలో అంకమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పమిడిముక్కల: ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. హనుమంతపురం గ్రామ చెరువులో ఆదివారం జరిగిన జల స్థూపం ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. గుర్రాల్లంకలో జరిగిన అంకమ్మ తల్లి జాతరలో ఆయన పాల్గొన్నారు. అంకమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. డప్పువాయిద్యాలతో ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మేడూరు గ్రామంలో జరిగిన గంగానమ్మ తల్లి జాతరలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఐ చిట్టిబాబు

పమిడిముక్కల: పమిడిముక్కల సీఐగా బాధ్యతలు స్వీకరించిన వై.చిట్టిబాబు ఆదివారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను మర్యాద పూర్వకంగా కలిశారు. గుర్రాలంకలో జరిగిన అంకమ్మతల్లి జాతరలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేను కలుసుకొని పూల మొక్కను బహూకరించారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని ఎమ్మెల్యే రాజా సీఐకు సూచించారు.

ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



పాపన్న గౌడ్ మహారాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కైకలూరు: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి వేడుక కైకలూరు తాలూకా సెంటర్‌లో నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో అనేక కోటలు నిర్మించిన పాపన్న గౌడ్ గోల్కొండకు చక్రవర్తిగా కొన్ని నెలలు పాలించారన్నారు. భారతదేశం తొలి తెలుగు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ కావడం విశేషం. కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘ అధ్యక్షుడు పోలగాని నాగరాజు, నాయకులు మాడెం వీరవెంకట సత్యనారాయణ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బొల్లా శ్యామలరాజు గౌడ్, మారగాని గణపతి, సింహాద్రి కేదారేశ్వరరావు, దాసరి శ్రీనివాసరావు, పడమట వాసు, పరసా సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు రాఖీ పౌర్ణమి



రాఖీలను కొనుగోలు చేస్తున్న చిన్నారులు

పామర్రు: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం రాఖీ పండుగను నిర్వహించనున్నారు. రాఖీ పండుగ రోజున అక్కచెల్లెమ్మలు తమ అన్నలు, తమ్ముళ్లకు రాఖీలు కట్టే సాంప్రదాయం ఉన్న నేపథ్యంలో ఆదివారం స్థానిక గఫార్ సెంటరు, శివాలయం వద్ద, నాలుగురోడ్ల కూడలి తదితర ప్రాంతాల్లో రాఖీల దుకాణాలను ఏర్పాలు చేశారు. రాఖీల దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.150 వరకు విలువ గల రాఖీలను విక్రయించారు. రాఖీలను కొనుగోలు చేసేందుకు చిన్నారులు దుకాణాల చుట్టూ చేరారు.

కైకలూరులో..

కైకలూరు: అన్నాచెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల ప్రేమకు నిదర్శనంగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలో ముఖ్యమైన రాఖీ విక్రయాలు కైకలూరులో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కైకలూరులో పలు కూడళ్లలో రాఖీ విక్రయ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు.

శ్రీమన్నారాయణ ఆశ్రమంలో రక్షాబంధన్ వేడుకలు



రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని శ్రీమన్నారాయణ ఆశ్రమంలో ధర్మరక్షాబంధన్ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు పలువురు పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నాకు నువ్వు రక్ష.. నీకు నేను రక్ష.. మనమిద్దరం దేశానికి, ధర్మానికి రక్ష అంటూ సంకల్పం చేస్తూ రక్షాబంధన్ కట్టారు. సమరసత సేవా ఫౌండేషన్ గన్నవరం సబ్ డివిజన్ ప్రచారక్ యడవల్లి పాండు రంగారావు, మహిళా కన్వీనర్ దావులూరి రమాదేవి, సభ్యులు కల్వకుంట్ల లక్ష్మీ, హారతి పాల్గొన్నారు.

జ్వరాలతో జనం విలవిల

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- పదుల సంఖ్యలో జ్వరపీడితులు



హనుమాన్‌జంక్షన్‌లోని జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో గత నెల రోజులుగా వైరల్ జ్వరాలు జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. పలు గ్రామాల్లో జ్వర పీడితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. దీంతో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడితే ఆ ఇల్లంతా జర్వాలు వ్యాపిస్తున్నాయి. కనీసం నాలుగైదు రోజులు హైటెంపరేచర్‌తో జ్వరంతో పాటు తీవ్రంగా ఆలసట, నీరసంతో రోగులు బాధపడుతున్నారు. అంతేకాక జర్వం తగ్గిన వారం, పది రోజుల వరకు కండరాలు, నడుము నొప్పులు తగ్గటం లేదు. ఈ తరహా లక్షణాలతో రోగులు పదుల సంఖ్యలో కనిపిస్తున్నారు. వాతావరణ మార్పులు, పారిశుద్ధ్య లోపం, దోమల వ్యాప్తితో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. మండలంలోని కొత్తపల్లి, తారకరామ కాలనీ, కె.సీతారామపురం, బండారుగూడెం, వీరవల్లి, బిళ్లనపల్లి, మల్లవల్లి గ్రామాల్లో వైరల్ జ్వరాల బాధితులు అధికంగా ఉన్నారు. బాపులపాడు, వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఇప్పటికే ఇంటింటి ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు జ్వరం లక్షణాలు కలిగిన రోగులను గుర్తించి రక్త పరీక్షలు చేస్తున్నారు.